ఒకే భవనం.. మూడు కాలేజీలు

- ఉన్నత విద్యాశాఖ కళ్లకు సీడీసీ గంతలు
- అనుమతులపై దుమారం
- విద్యను వ్యాపారంగా మార్చిన యాజమాన్యాలు
- సీట్లు రాక అయోమయంలో విద్యార్థులు



ఒకే భవనంలో 3 కళాశాలలు నడుస్తున్న భవనము

కర్నూలు జిల్లాలో బీఈడీ కళాశాలల తీరు చర్చనీయాంశమైంది. ఒకే భవనంలో మూడు కళాశాలలను ఆ కాలేజీ యాజమాన్యం నిర్వహిస్తోంది. 2025-26 విద్యా సంవత్సరానికి బీఈడీ అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికే వంద శాతం ముగిసింది. ఉమ్మడి జిల్లాలో 49 బీఈడీ కళాశాలలున్నా వీటిలో ఇతర రాష్ట్రాల విద్యార్థులతో భర్తీ చేస్తున్నారు. స్థానిక విద్యార్థులకు అడ్మిషన్లు లేవని యాజమాన్యాలు చెబుతున్నాయి. ఉన్నత విద్యా మండలి అనుమతి ఉందని, తాము ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నాయి. విద్యార్థుల తరపున పోరాటం చేయాల్సిన విద్యార్థి సంఘాలు సైతం వారితో కుమ్మక్కు కావడం బాధాకరం.

కర్నూలు అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బీఈడీ కళాశాల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. కర్నూలు నగరం క్రిష్ణానగర్‌లో ఒకే భవనంలో రెండు బీఈడీ, ఒక ఫార్మా కాలేజీకి అనుమతులివ్వడం చర్చనీయాంశమైంది. రాయలసీమ యూనివర్సిటీలోని సీడీసీ(కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్) సొంత భవనాలు, అద్దె భవనాలను పరిశీలించకుండా గుడ్డిగా మంజూరు చేశాయి. ఉన్నత విద్యాశాఖ కళ్లకు గంతలు కట్టి కొందరు ప్రొఫెసర్లు దందాకు తెరలేపారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక పట్టణాలు, ఇతర ప్రాంతాల్లో ఎన్ని కళాశాలలకు అనుమతులిచ్చి ఉంటారనే దానిపై చర్చ సాగుతోంది. ఒకే భవనంలో ఓ కళాశాలకు ఓ ప్రొఫెసర్ బంధువు కావడం.. మరో బీఈడీ కళాశాల పంచలింగాల గ్రామంలో ఉండాల్సిన కళాశాలను ఈ భవనంలో ఉన్నట్లు చూపించి గడిచిన 3వ తేదీన వర్సిటీ సీడీసీ విభాగం అనుమతులివ్వడం దుమారం రేపుతోంది.

అడ్మిషన్లు లేవంటూ..

ఇంకా రెండు కౌన్సెలింగ్‌లు ఉన్నా ఇప్పటికే ఇక్కడ అడ్మిషన్లు లేవంటూ కౌన్సెలింగ్‌లో విద్యార్థులకు యాజమాన్యాలు సూచిస్తున్నాయి. ఒరిస్సా, బిహార్, నాగాలాండ్, త్రిపుర, మీజోరం విద్యార్థులతో నిండిపోయాయని బహిరంగంగానే చెబుతున్నారు. ఉన్నత విద్యామండలి నుంచి తాము అనుమతులు పొందామని, వర్సిటీ అధికారుల ప్రమేయం ఇందులో ఏమి లేదని పేర్కొంటున్నాయి. తాము ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, విద్యార్థి సంఘాలు సహకరించాలంటూ వారితో చర్చలు జరిపి దందాకు తెరలేపారని కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ అయినా న్యాయం చేయాలని..

ఉమ్మడి జిల్లాలో బీఈడీలో చేరేందుకు ఎందరో విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. సీటు రాకపోయే సరికి అయోమయంలో పడ్డారు. విద్యార్థుల తరపున పోరాడాల్సిన విద్యార్థి సంఘాలు కూడా కళాశాలల యాజమాన్యాలతో కుమ్మక్కై తమ ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. కలెక్టర్ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

బిల్డింగ్‌లు లేని కాలేజీలకు అనుమతులు?

జిల్లాలో వెంకటరత్నం, పంచలింగాలలోని బాలాజీ బీఈడీ కళాశాలలు, శివసాయి క్రిష్ణ నందికొట్కూరు, గాయత్రి, శ్రీసుధ కాలేజీలు డోన్, నాయక్ కాలేజీ దూపాడు, వరప్రసాద్ కాలేజీ పంచలింగాల, నందికొట్కూరులోని షిరిడీ సాయిబాబా కాలేజీలకు సొంత భవనాలు లేకున్నా అనుమతులు ఎలా ఇస్తారంటూ విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

సంబంధం లేని ప్రశ్నలు వేసి..

మొదటి కౌన్సెలింగ్‌లో సంబంధం లేని ప్రశ్నలు వేసి సీటు రాకుండా చేశారు. విద్యార్థి సంఘాల దృష్టికి తీసుకెళ్తే ఇంకా రెండు కౌన్సెలింగ్‌లు ఉన్నాయి కదా వేచి చూడండంటూ సలహాలు ఇచ్చారు.

● సవీత, విద్యార్థి



ఫైల్ నాటేబుల్‌కు రాలేదు

ఒకే భవనంలో రెండు బీఈడీ కళాశాలలకు అనుమతులు ఇచ్చారా? ఈ ఫైల్ నా టేబుల్‌కు రాలేదు. వస్తే పరిశీలిస్తా. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురండి. న్యాయం చేసేందుకు కృషి చేస్తా.

- విజయకుమార్ నాయుడు, రిజిస్ట్రార్, ఆర్‌యూ



రాయలసీమ యూనివర్శిటీ

జేసీగా కొల్లాబత్తుల కార్తీక్

● ప్రస్తుత జేసీ సాంఘిక సంక్షేమ శాఖకు బదిలీ



కొల్లాబత్తుల కార్తీక్



విష్ణుచరణ్

నంద్యాల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 31మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్(జేసీగా) పనిచేస్తున్న విష్ణుచరణ్‌ను సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రెటరీగా బదిలీ చేసింది. ఈయన స్థానంలో కొల్లాబత్తుల కార్తీక్‌ను జేసీగా నియమించింది. 2020 బ్యాచ్‌కు చెందిన ఈయన సివిల్స్‌లో 428 ర్యాంకు సాధించారు. కార్తీక్ స్వస్థలం విశాఖపట్నం. గతంలో సత్యసాయి జిల్లాలోని పెనుకొండ సబ్‌కలెక్టర్‌గా పనిచేశారు. తాజాగా పోస్టింగ్ కోసం నిరీక్షణలో ఉండగా ఇక్కడికి కేటాయించారు. జేసీగా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

శ్రీశైలం డ్యాం నీటిమట్టం 884 అడుగులు



శ్రీశైలం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 884 అడుగులుగా ఉంది. నీటినిల్వ సామర్థ్యం 213 టీఎంసీలుగా నమోదు అయింది. ఎగువ జూరాల స్పిల్‌వే నుంచి 35,825 క్యూసెక్కుల నీరు, విద్యుదుత్పత్తి అనంతరం 44,021, సుంకేసుల నుంచి 2,264, హంద్రీ నుంచి 250 కూసెక్కుల నీరు వచ్చి చేరింది. శ్రీశైలం విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి తరువాత 66,068 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు. శ్రీశైలం డ్యాం గేట్లను బుధవారం నుంచి మూసివేశారు.

వైభవంగా పవిత్రోత్సవం

ప్రహ్లాద వరద స్వామికి ప్రత్యేక పూజలు



పవిత్రోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు చేస్తున్న పీఠాధిపతి

ఆళ్లగడ్డ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలంలో పవిత్రోత్సవాలు గురువారం మూడో రోజు వైభవంగా నిర్వహించారు. ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లుకు ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి పర్యవేక్షణలో లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లుకు ఆలయ ప్రధాన అర్చకులు పవిత్ర మాలలతో అలంకరించి హోమం పూర్ణహుతి నిర్వహించారు. లక్ష్మీనరసింహ స్వామి అమ్మవార్లను పల్లకిలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. చెన్నైకు చెందిన టీవీఎస్ కంపెనీ అధినేత సుందర్‌రాజన్ ఆలయానికి వెండి మకర తోరణాన్ని బహూకరించారు. ఈ మకర తోరణాన్ని ఆలయ ప్రధాన పూజారి వేణుగోపాల్‌స్వామికి అందజేసి ప్రత్యేక పూజలు చేశారు.

అర్చకులే ఆలయాన్ని భ్రష్టు పట్టించారు

● దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి



మాట్లాడుతున్న దేవదాయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి

కొత్తపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆలయ పవిత్రతను కాపాడాల్సిన ఆలయ అర్చకులే కొలనుభారతి అమ్మవారి ఆలయాన్ని భ్రష్టు పట్టించారని నంద్యాల జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఈవో రామలింగారెడ్డి, ఆలయ చైర్మన్ వెంకట నాయుడు, సర్పంచ్ చంద్రశేఖర్‌యాదవ్ సమక్షంలో అమ్మవారి హుండీ లెక్కింపును చేపట్టారు. ఈకార్యక్రమానికి హరిశ్చంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ ఏడాది మే 26 నుంచి అక్టోబరు 9వ తేదీ వరకు దాదాపు 5నెలల హుండీ లెక్కించగా.. కేవలం రూ.1,44,115లు మాత్రమే ఆదాయం లభించడంపై ఆయన అవాక్కయ్యారు. ఈ సందర్భంగా హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ కొలనుభారతి ఆలయాల అర్చకుల అంతర్గత కలహాలతో భక్తుల నుంచి అక్షరాభ్యాసం, సంభావన పేరుతో అధిక నగదును డిమాండ్ చేస్తూ ఆలయ ఆదాయానికి గండి కొట్టారని మండిపడ్డారు. గతంలో రూ.2లక్షలకు పైగా ఆదాయం రాగా, ప్రస్తుతం హుండీ లెక్కింపులో రూ.40వేలకు పైగా ఆదాయం తగ్గిందన్నారు. ఇక నుంచి భక్తులు అర్చకులకు ఎలాంటి కానుకలు ఇవ్వద్దని, హుండీలో కానుకలు వేసి ఆలయ అభివృద్ధికి సహకరించాలన్నారు.

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్యసేవలు బంద్

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో శుక్రవారం నుంచి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైద్యసేవలు బంద్ చేస్తున్నట్లు ఆరోగ్యశ్రీ వైద్యశాలల బృందం ప్రకటించింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు ఆరోగ్య శ్రీ ఆస్పత్రుల నిర్వాహకులు వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు వినతిపత్రం అందజేశారు. అందులో భాగంగా శుక్రవారం నుంచి నంద్యాలలో ఆరోగ్యశ్రీ కింద ఎన్టీఆర్ వైద్యసేవలు నిలిచిపోనున్నాయి.

పొగాకు వాడకంతో అనేక సమస్యలు

● డీఎంహెచ్‌వో వెంకటరమణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పొగాకు వాడటంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. గురువారం టుబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 3.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాలయాల ఆవరణల్లో వంద మీటర్ల దూరం వరకు బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధమన్నారు. పాఠశాల ఆవరణలను పొగాకు ఫ్రీజోన్‌గా డిక్లేర్ చేశారన్నారు. పొగాకుతో క్యాన్సర్, ముఖ్యంగా గుండె, నోటి క్యాన్సర్ వస్తాయన్నారు. ఈ కార్యక్రమం డిసెంబరు 8వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్, పంచాయతీరాజ్, ఎక్సైజ్, హెల్త్ డిపార్ట్‌మెంట్లు భాగస్వామ్యం కావాలన్నారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, డెమో రవీంద్ర నాయక్, నేషనల్ టుబాకో కంట్రోల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ చినవీరన్న తదితరులు పాల్గొన్నారు.

హరిత సుంకం తగ్గింపు



- లారీ యజమానులకు ఊరట
- భారీగా పెంచిన గత ప్రభుత్వం

నంద్యాల టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): 2014-2019 మధ్య వాహనాల మోడల్ ప్రకారం రూ.200 -500 వరకు గ్రీన్ ట్యాక్స్(హరిత సుంకం) చెల్లించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీన్ని ఏకంగా రూ.5వేల నుంచి 20వేలు వరకు పెంచేసింది. కూటమి ప్రభుత్వం వాహనాల గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గిస్తూ సవరించిన బిల్లును శాసన సభలో అమోదించింది. దీంతో లారీ యజమానులకు భారీగా ఊరట లబించింది.

రూ.2.5 కోట్లు వసూలు కాగా..

2018-19లో మధ్య హరిత సుంకం రూ.2.5 కోట్లు వసూలు కాగా వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా రూ.8కోట్లు వసూలు చేసినట్లు అంచనా. గత ప్రభుత్వం ఇస్టానుసారంగా పన్నులు పెంచడం.. బాడుగలులేక లారీ యజమానులు ఆర్థికంగా నష్టపోయారు. యజమానులకు భారంగా మారిన గ్రీన్ ట్యాక్స్ ప్రభుత్వం తగ్గించడంతో వాహన దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఆ వెంటనే తగ్గిన గ్రీన్‌ట్యాక్స్ విధానాన్ని జిల్లాలో ఆమలు చేయనున్నారు.

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో..

నంద్యాల జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, నందికొట్కూర్, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గాల్లో మొత్తం సుమారుగా 18 వేల వాహనాలు ఉన్నట్లు రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో సరుకు, ప్రజా రవాణా వాహనాలపై గ్రీన్‌ట్యాక్స్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తగ్గించి వాహనదారులకు స్వాంతన చేకూర్చింది. జిల్లాలో ఎక్కువగా బనగానపల్లె, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు వంటి ప్రాంతాల్లో లారీలున్నాయి. శాసనసభలో ఆమోదించిన బిల్లు ప్రకారం మూడు శ్లాబుల్లో 12 ఏళ్ల పైబడిన లారీలకు గ్రీన్‌ట్యాక్స్ తగ్గనుంది. 10టన్నుల లారీలపై పన్ను రూ.5వేలు ఉండగా ప్రస్తుతానికి రూ.1500, 30 టన్నులు లారీలపై పన్ను రూ.15వేలు ఉండగా ప్రస్తుతం రూ.3వేలు చెల్లిస్తే సరిపోతుంది.

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే..




హరిత సుంకం తగ్గింపుతో భారీ వాహనదారులకు ఊరట కలిగిస్తుంది. ఈ సవరణ బిల్లుతో సక్రమంగా గ్రీన్‌ట్యాక్స్ కట్టుకుంటారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే అమలు చేసి ప్రతి ఒక్కరూ కట్టేలా చర్యలు తీసుకుంటాం.

● శివారెడ్డి, జిల్లా రవాణా అధికారి, నంద్యాల

భారీ వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి

ట్రాక్టర్లతో దున్నేసిన రైతులు



వర్షాలకు దెబ్బతిన్న ఉల్లిగడ్డలు

చాగలమర్రి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఉల్లి పంట రైతుకు కన్నీటిని మిగిల్చింది. మూడు నెలల పాటు ఉల్లి పంటను పండిస్తే ధర లేక రైతన్నలు దిగాలు చెందుతున్నాడు. చాగలమర్రి మండలం చిన్న వంగలి గ్రామంలో ఎదురు నర్సమ్మ అనే మహిళా రైతు 1.50 ఎకరాలు, శీలం శివనాగిరెడ్డి 3 ఎకరాల్లో ఉల్లిని సాగు చేశారు. ధర లేకపోవడంతో గురువారం పొలంలోనే కుప్పలుగా పోసిన ఉల్లిగడ్డలను వదిలేశారు. విషయం తెలుసుకున్న ప్రజలు పొలం వద్దకు వెళ్లి సంచుల్లో ఉల్లిగడ్డలను తీసుకెళ్లారు. ఉల్లిగడ్డలను కోసి మార్కెట్ తీసుకెళ్లే డబ్బు కూడా రైతుకు రాకపోవడంతో పంటను వదిలేస్తున్నారు. 4.50 ఎకరాల్లో రూ.3 లక్షలు దాకా పెట్టుబడి పెట్టి నష్టపోయామని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇదే క్రమంలో మరో ఇద్దరు రైతులు ఉల్లి పంటను ట్రాక్టర్లతో దున్నేశారు.

ప్రజాభిప్రాయ సేకరణలో మెరుగైన శాతాన్ని సాధిస్తాం



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణలో నంద్యాల జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధిస్తామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లాలో సాధించిన ప్రగతిపై కలెక్టర్ రాజకుమారి వివరించారు. రెవెన్యూ అంశాలపై జిల్లా పరిపాలన ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఇప్పటి వరకు 25వేల జాయింట్ ఎల్‌పీఎంలు పరిష్కరించామన్నారు. ఈకార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ స్వప్నం సాకారం


జియో మైసూరు కంపెనీ

- ఏటా 500 కేజీల బంగారు వెలికితీత
- జియో మైసూర్ తొలి ప్రైవేటు బంగారు వెలికితీత కంపెనీ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు
- పర్యావరణ పరిరక్షణకు చర్యలు
- ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యం
- ఈనెలాఖరులో పూర్తిస్థాయిలో ఉత్పత్తి

ఎన్నో ఏళ్ల నుంచి బంగారు వెలికితీత పనులు సాకారం చేసుకునేందుకు ఎన్నో కంపెనీలు పోటీ పడ్డాయి. జియో మైసూరు కంపెనీ నెల రోజుల్లో బంగారు ఉత్పత్తి పనులను ప్రారంభించేందుకు సన్నద్ధమవుతుంది. ఏటా 500కేజీల బంగారం వెలికితీసేందుకు సిద్ధమైంది. కర్నూలు జిల్లాలోని తుగ్గలి మండలంలోని జొన్నగిరి, ఎర్రగుడి, పగిడిరాయి గ్రామ పంచాయతీల పరిధిలో భారతదేశపు తొలి ప్రైవేటు బంగారు గని పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈనెలాఖరులో గానీ, నవంబరు మొదటి వారంలో పనులు ప్రారంభిస్తున్నట్లు కంపెనీ యాజమాన్యం చెబుతోంది.

తుగ్గలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్ల బంగారు కల నెల రోజుల్లో సాకారం కానుంది. దేశంలోనే తొలి ప్రైవేటు బంగారు వెలికితీత కంపెనీగా జియో మైసూరు కంపెనీ వెలుగొందుతుంది. బంగారు నిక్షేపాల వెలికితీత కోసం ఈకంపెనీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు పూర్తయ్యాయి. బంగారు ఉత్పత్తిని ప్రారంభించేందుకు సిద్ధం గా ఉంది. త్వరలో ఇక్కడ అట్టహాసంగా బంగారు నిక్షేపాల వెలికితీత పనులు చేపట్టనున్నారు. ప్రభుత్వం అందించే చట్టబద్ధమైన అనుమతులతో ఏటా 500 కిలోల బంగారు ఉత్పత్తికి మిషనరీలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఏటా వేయి కిలోల బంగారు వెలికితీతకు అనుమతులు పొందామన్నారు. కంపెనీ బంగారు వెలికితీతలో 1.5టన్నుల మట్టికి ఒక గ్రాము బంగారం వస్తుందని, ఇలా రోజుకు దాదాపు 1.3గ్రాముల బంగారం వెలికితీయనున్నారు.


ఓపెన్ మైనింగ్ చేస్తున్న దృశ్యం

వేల మొక్కలు నాటారు

జియో మైసూరు గోల్డ్ కంపెనీ ఆధ్వర్యంలో జొన్నగిరి, పగిడిరాయి, బొండ్లవానిపల్లె, జి.ఎర్రగుడి, చెన్నంపల్లి, పగిడి రాయి కొత్తూరు తదితర గ్రామాల్లో విద్య, వైద్యంతో పాటు గ్రామాల్లోని అన్ని సమస్యలను పరిష్కరించనున్నారు. అలాగే కంపెనీ చుట్టూ పర్యావరణ పరిరక్షణ కోసం వేల మొక్కలు నాటారు. బంగారు నిక్షేపాల్లో గోల్డ్ డోలేబార్ అనే నిక్షేపం లభిస్తుంది. ఆ ముడి పదార్థాన్ని కంపెనీ ప్రాజెక్టు లోనే రీఫైనరీ చేసి ప్యూర్ గోల్డ్‌గా మారుస్తారు.


కంపెనీ ఆవరణంలో ఉన్న పచ్చదనం

సుమారు 600 మందికి..

జియో మైసూరు కంపెనీ ప్రాజెక్టులో ఆంధ్రప్రదేశ్ నుంచి 600మంది ఉద్యోగులను పనుల్లో తీసుకున్నారు. స్థానికులకే 80శాతానికి పైగా ఉద్యోగాలు ఇస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. బంగారు నిక్షేపాల వెలికితీత కోసం, ఓపెన్ కాస్ట్ మైనింగ్ చేయడం కోసం దాదాపు 597హెక్టార్లను లీజుకు తీసుకుని, 283ఎకరాలు కొనుగోలు చేసి తూర్పు వైపున ఓపెన్ కాస్ట్ మైనింగ్ మొదటగా ప్రారంభించి బంగారు వెలికితీత పనులు చేపట్టనున్నారు.




జియో మైసూరు కంపెనీ ఫ్యాక్టరీ

దేశ ప్రగతి కోసమే..



దేశ ప్రగతి కోసం జియో మైసూరు కంపెనీ ఏర్పాటు చేశాం. బంగారు నిక్షేపాల వెలికితీతతో దేశ ఆర్థిక వ్యవస్థ సమతుల్యం అవుతుంది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న బంగారు శాతాన్ని కొంతవరకు తగ్గించొచ్చు. దేశంలోనే తొలి ప్రైవేటు బంగారు వెలికితీత కంపెనీ. ప్రాజెక్టును ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాం. సహకరించిన స్థానికులకు, రైతులకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతగా ఉంటాం.

● బి.ప్రభాకరన్, ప్రధాన వాటాదారుడు, జియో మైసూరు కంపెనీ

రేపు జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలను శనివారం నిర్వహిస్తున్నట్లు రోలర్ స్కేటింగ్ సంఘం జిల్లా కార్యదర్శి అబూబకర్, సీఈవో పి.సునీల్‌కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని ఆసక్తిగల స్కేటింగ్ క్రీడాకారులు రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆర్ఎస్ఎఫ్ఐ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలు బీ.క్యాంపు సమీపంలోని ఖానా ఖజానా రోడ్డులో శనివారం ఉదయం 8 గంటలకు రోడ్ రేసులతో ప్రారంభమవుతాయన్నారు. ఇక్కడ ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

లోక్‌అదాలత్‌తో తక్షణ న్యాయ సహాయం

- లీగల్ సర్వీసెస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి

కర్నూలు లీగల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌ను ఆశ్రయిస్తే తక్షణమే న్యాయ సహాయాన్ని అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి అన్నారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో గురువారం పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే వాటిపై అపీల్‌కు కూడా వీలులేదని, చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి వాపసు ఇస్తార న్నారు. లీగల్ సర్వీసెస్ సేవల గురించి ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు పారా లీగల్ వలంటీర్లు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పారా లీగల్ వాలంటీర్లకు బాల్య వివాహాల నిరోధక చట్టం, వరకట్న నిరోధక చట్టం, కార్మిక సంక్షేమ చట్టాలతో పాటు పలు చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్మన్ వెంకట హరినాథ్ మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్ ప్రజలకు అందించే ప్రతిసేవలపై పారా లీగల్ వలంటీర్లు అవగాహన కల్పించుకోవాలని కోరారు. ఈ ఏడాది శాశ్వత లోక్‌అదాలత్‌లో 121 కేసులు దాఖలయ్యాయని, వాటిలో 56 కేసులను సత్వరంగా పరిష్కరించి కక్షిదారులకు ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, పలువురు పారా లీగల్ వలంటీర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మార్కెట్ మాయ..!

- యార్డులో కిలో ఉల్లి రూ.2
- బహిరంగ మార్కెట్‌లో రూ.20


రైతులు మార్కెట్ యార్డుకు తెచ్చిన ఉల్లి బస్తాలు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో గురువారం రైతులు తెచ్చిన ఉల్లి క్వింటా కనిష్ఠ ధర కేవలం రూ.218 మాత్రమే దక్కింది. గరిష్ఠంగా రూ.1,181, సగటున రూ.585 దక్కింది. రైతులు గ్రామాల్లోనే ఉల్లిని గ్రేడింగ్ చేసి అమ్మకానికి తెచ్చినప్పటికీ ధర పడిపోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ లెక్కన ఉల్లి కిలో రూ.2గా మాత్రమే అమ్మకాలు జరిగాయి. గురువారం కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు 2,156 క్వింటాళ్ల ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. ఇదే సమయంలో బహిరంగ మార్కెట్‌లో రిటైల్ వ్యాపారులు కిలో ఉల్లిని రూ.20కిపైగా అమ్మడంతో వినియోగదారులు లబోదిబో మంటున్నారు. రైతుల నుంచి కేవలం రూ.2లకే కొనుగోలుచేసి బయటి మార్కెట్‌లో రూ.20 నుంచి రూ.30లకు విక్రయించడం గమనార్హం. కర్నూలు మార్కెట్ కమిటీ అధికారులు రైతులు తెచ్చిన ఉల్లికి సరైన పర్యవేక్షణ చేసి గిట్టుబాటు ధర అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కర్నూలు జేసీగా నూరుల్

- 24 ఏళ్లకే ఐఏఎస్‌గా ఎంపిక
- ఏపీ గిడ్డంగుల సంస్థ వైస్ ఛైర్‌పర్సన్‌గా జేసీ నవ్య బదిలీ
- శ్రీసత్యసాయి జేసీగా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


నూరుల్ క్వామర్

కర్నూలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ)గా నూరుల్ క్వామర్ (ఐఏఎస్-2020)ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రెటరీగా పని చేస్తున్న ఈయనను జేసీగా బదిలీ చేశారు. 24 ఏళ్లలోనే ఐఏఎస్‌గా ఎంపికైన నూరుల్ ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా కర్నూలు జిల్లా నుంచే సివిల్ సర్వీస్ ఉద్యోగ ప్రస్థానం ప్రస్థానం మొదలు పెట్టారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన తనకు చిన్నవయసులోనే గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని ఆంధ్రజ్యోతికి వివరించారు.

బిహార్ రాష్ట్రానికి చెందిన నూరుల్ క్వామర్ ఓ సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. తండ్రి అబిద్‌హుసేన్ వ్యవసాయం చేస్తూ పిల్లలను ఉన్నతంగా చదించాలని సంకల్పించారు. కన్నవాళ్ల ఆశయాలను అనుగుణంగా చదువుల్లో రాణించి అతి చిన్నవయసులోనే సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ప్రభుత్వ బడిలో ప్రాథమిక విద్యాభ్యాసం సాగించారు. డిగ్రీ విద్యాభ్యాసం అనంతరం ఆయన బ్యాంకు ఉద్యోగిగా ఎంపికయ్యారు. ర్వాత 2019లో సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసి తొలి ప్రయత్నంలోనే ఆలిండియా స్థాయిలో 252వ ర్యాంకు సాధించారు. అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ)గా నూరుల్ క్వామర్ 2020లో కర్నూలు జిల్లా నుంచే ప్రస్థానం మొదలు పెట్టారు. ట్రైనీ కలెక్టర్‌గా ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 11 నెలలు పని చేశారు. శిక్షణ అనంతరం ఆయన కేంద్ర ప్రభుత్వం అసిస్టెంట్ సెక్రెటరీగా పని చేశారు. ఆ తరువాత పార్వతీపురం, టెక్కలి సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. 2024 జూలైలో రాష్ట్ర ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రెటరీగా విధులు నిర్వరిస్తున్నారు. ఐఏఎస్‌గా ప్రస్థానం మొదలు పెట్టిన కర్నూలు జిల్లాకే జాయింట్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో పలు అంశాలను ఆయన ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. 'ఐఏఎస్‌గా ఎంపికై ఏపీకి వచ్చాక ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా కర్నూలు జిల్లాకే వచ్చాను. ఈ ప్రాంతం కొత్త కావడంతో మొదట్లో కొంత ఇబ్బంది అనిపించినా, తర్వాత జిల్లా అంతటా విస్తృతంగా తిరిగాను. ప్రతి కార్యక్రమంలో పాల్గొనడం వల్ల జిల్లాపై సంపూర్ణ అవగాహన వచ్చింది. ఆర్థిక శాఖలో డిప్యూటీ సెక్రెటరీగా పని చేస్తున్న నన్ను ఈ జిల్లా జేసీగా ప్రభుత్వం నియమించింది. ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరిస్తాను. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అర్హులపై ప్రజలకు అందించడమే నా ప్రథమ కర్తవ్యం. అదే క్రమంలో కీలకమైన సివిల్ సప్లయ్, భూ సమస్యలు, భూ రికార్డులపై ప్రత్యేక దృష్టి సారిస్తా. జేసీగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు పాల్గొనే పర్యటన ఏర్పాట్లలో భాగస్వామ్యం కావడం అరుదుగా వచ్చే అవకాశం. చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.

జేసీ, ఆదోని సబ్ కలెక్టర్ బదిలీ




కర్నూలు జిల్లా జేసీ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. జాయింట్ కలెక్టర్ బి.నవ్య గత ఏడాది ఆగస్టు 14న బాధ్యతలు చేపట్టారు. ఆమెను ఏపీ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ వైస్ ఛైర్‌పర్సన్, ఎండీగా ప్రభుత్వం నియమించింది. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ 2024 సెప్టెంబరు 3న బాధ్యతలు చేపట్టారు. ఆయనను శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ)గా ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రస్తుతం ఆయన ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లలో భాగంగా సభా ప్రాంగణం ఏర్పాట్లు బాధ్యతలు చూస్తున్నారు. కలెక్టర్ డాక్టర్ సిరి ఆయన్ను రిలీవ్ చేస్తారా..? ప్రధాని పర్యటన తరువాత రిలీవ్ చేస్తారా..? అన్నది తెలియాల్సి ఉంది.

ఏపీజీఈఏ నర్సెస్ విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్‌గా మంజులదేవి


నర్సెస్ విభాగం రాష్ట్ర ఛైర్ పర్సన్ మంజులదేవిని అభినందిస్తున్న సూర్యనారాయణ

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నర్సెస్ విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్‌గా కర్నూలు జీజీహెచ్‌కు స్టాఫ్ నర్సు డాక్టర్ మంజులదేవి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం విజయవాడలో జరిగిన ఏపీజీఈఏ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రమేష్ కుమార్ ఈ విషయాన్ని ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ఛైర్ పర్సన్ మంజులదేవి మాట్లాడుతూ నర్సుల విభాగాన్ని మరింత బలోపేతం చేయడం వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం అవసరమన్నారు. రాష్ట్రంలోని నర్సింగ్ సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

ప్రధాని పర్యటనను జయప్రదం చేయండి

పాణ్యం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని మోదీ పాణ్యం నియోజకవర్గంలోని నన్నూరు సభకు ఈనెల 16 వతేదీన వస్తున్న సం దర్భంగా సభను విజ యవంతం చేయాలని పా ణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పిలుపునిచ్చారు. గురువారం నంద్యాలలోని హృదయ ఇన్ హోటల్ బ్యాంకెట్ హాల్‌లో నిర్వహించిన సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమానికి ఆమెతో పాటు నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, పాణ్యం, గడివేముల మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ వడ్డు లక్ష్మీదేవి, పాణ్యం మండల కన్వీనర్ గణపం జయరామిరెడ్డి, గడివేముల మండల అధ్యక్షులు దేశం నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, పాణ్యం మండల జనసేన నాయకులు జగదీశ్‌బాబు, కూటమి పార్టీలనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహా భాగ్యం

మానసిక ఆరోగ్యం..

- ఒత్తిడే అనర్థాలకు కారణం
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



మనిషి ఎప్పుడూ ఉత్సాహంగా ఉండాలంటే మనస్సు ప్రశాంతంగా ఉండాలి. ప్రస్తుతం మనిషి యాంత్రిక జీవితాన్ని గడుపుతున్నారు. నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు యంత్రంలా పనిచేస్తున్నాడు. దీంతో ఒత్తిడికి లోనవుతున్నారు. కొందరు ఈ ఒత్తిడి కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రపంచ వ్యాప్తంగా అక్టోబరు 10వ తేదీన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది 'వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ మెంటల్ హెల్త్ విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో మానసిక సేవల లభ్యత అన్న నినాదాన్ని ఇచ్చింది. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం..

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మానసిక ఆరోగ్యం అనేది మహా భాగ్యం. ఒత్తిడిని జయిస్తే మానవుడు ప్రశాంతంగా జీవించొచ్చు. మనిషి శారీరక ఆరోగ్యం బాగుండాలంటే ఖచ్చితంగా మానసిక ఆరోగ్యం బాగుండాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మానసిక ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఉంది.

యువత, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరగడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ సోషల్ మీడియా వ్యసనం ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

మానసిక ఆరోగ్యంపై ప్రభావం: సోషల్ మీడియా మన జీవితాల్లో అంతర్భాగంగా మారింది. రోజుకు మూడు గంటల కన్నా ఎక్కువగా ఉపయోగించడంతో ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



హెచ్చరిక సంకేతాలు

మునుపటి కన్నా తక్కువగా లేదా ఎక్కువగా తినడం. సరిగా నిద్ర పోకపోవడం. ఉత్సాహం తగ్గడం, నీరసం, బద్ధకం. నలుగురితో కలవకుండా ఒంటరిగా ఉండటం. తనతో తాను మాట్లాడుకోవడం. కుటుంబ సభ్యులు, స్నేహితుల మీద అకారణంగా అరవడం, కోపగించడం, ఇంట్లో, ఆఫీసులో రోజువారి పనులు చేయలేకపోవడం.

ప్రతి రోజూ 100 నుంచి 120 మంది..


కర్నూలు జీజీహెచ్‌లోని మానసిక ఆరోగ్య విభాగానికి ప్రతిరోజూ 100 నుంచి 120 మంది ఓపీకి రోగులు వస్తుంటారు. ఇందులో 3నుంచి 5మంది అడ్మిషన్ పొందుతుంటారు. మానసిక ఆరోగ్య విభాగానికి 30 పడకలతో కూడిన ప్రత్యేక విభాగం ఉంది. ఇందులో డీఅడిక్షన్ సెంటర్ కూడా ఉంది. ఉమ్మడి జిల్లాలో కర్నూలు జీజీహెచ్, నంద్యాల జీజీహెచ్, శాంతిరాం విశ్వభారతి మెడికల్ కాలేజీతో పాటు ప్రైవేటులో మానసిక వైద్య నిపుణులు 35 మంది దాకా ఉన్నారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి



20 ఏళ్లలోపు పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి. ఒకవేళ అవసరమైతే తల్లిదండ్రుల పర్యవేక్షణలో సెల్‌ఫోన్‌ను చూడాలి. ఇటీవల కాలంలో యువత బెట్టింగ్, డ్రగ్స్ వంటి విపత్తును ఎదుర్కొంటుంది.

● డా.హరిప్రసాద్, కంచర్ల, న్యూరో సైక్రియాటిస్టు, సంఘమిత్ర క్లినిక్, కర్నూలు



లైఫ్ స్కిల్స్ నేర్చుకోవాలి



విద్యార్థులు లైఫ్ స్కిల్స్‌ను నేర్చుకోవాలి. దీంతో ఒత్తిడి, ఆందోళన డిప్రెషన్‌ను జయించొచ్చు. లైఫ్ స్కిల్స్ లేకపోతే అలాంటి విద్యార్థులు ఒత్తిడికి గురై ఇటీవల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. యువత టీవీ ల్యాప్ టాప్, సెల్‌ఫోన్లకు బానిసలుగా మారుతున్నారు.

● డా.ఎన్.నాగేశ్వరరావు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, మానసిక ఆరోగ్య విభాగం, జీజీహెచ్, కర్నూలు

మానసిక జబ్బులను గుర్తించాలి



విపత్తులు, అత్యవసర పరిస్థితులలో మానసిక జబ్బులను (మెంటల్ ఫస్ట్ ఎయిడ్) ముందుగానే గుర్తించి వైద్యులతో చికిత్స చేయించుకోవాలి. తీవ్ర ఒత్తిడితో కొందరు వ్యసనాలకు బానిసలు కావడం.. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు.

● డా.కే.నాగిరెడ్డి, మానసిక వ్యాధుల నిపుణులు, ఆశా కిరణ్ మైండ్‌కేర్, కర్నూలు

నిందితుల అరెస్టు

కర్నూలు క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజ్‌విహార్ సర్కిల్‌లో సుబ్రహ్మణ్యం అనే వృద్ధుడిపై దాడి చేసి డబ్బులు లాకెళ్లిన ఘటనలో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. మూడు రోజుల క్రితం ఆత్మకూరు చెందిన సుబ్రహ్మణ్యం కర్నూలులో ఉన్న తమ బంధువుల పెళ్లికి హాజరయ్యారు. తిరిగి వెళ్లేందుకు రాజ్‌విహార్‌లో ఉన్న బస్టాండుకు చేరుకున్నారు. అక్కడే ఉన్న బంగారుపేటకు చెందిన శాంత, ప్రసాద్, రవి, సంధ్యలు ఆ వృద్ధుడిపై దాడి చేసి నగదును లాక్కెళ్లారు. బాధితునికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో హైదరాబాదు జాతీయ రహదారిలో తుంగభద్ర నది వంతెనపైన గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా.. గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో వెనుక నుంచి ఓ వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 30-35 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుని శరీరంపై పాచి కలర్ షర్టు, పంచ ఉంది. ఆచూకీ తెలిసిన వారు 9121101063కు ఫోన్ చేయాలని పోలీసులు తెలిపారు.

యూనివర్సిటీలకు మెమోలు జారీ

కర్నూలు అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు యూనివర్సిటీలకు సంబంధించిన వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలపై సంజాయిషీ కోరుతూ ఆయా యూనివర్సిటీలకు కలెక్టర్ ఇటీవలే మెమోలు జారీ చేశారు. ప్రతి సోమవారం జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో(పీజీఆర్ఎస్) ఫిర్యాదుల వెల్లువతో జిల్లాలోని మూడు వర్సిటీలపై ఫిర్యాదులు నమోదయ్యాయి. ఓ వర్సిటీపై ఇదే నెలలో వివిధ పత్రికల్లో ఆరు వ్యతిరేక కథనాలు, అడ్వర్స్ వార్తల బ్లాగ్‌లో నమోదు కావడంతో సంజాయిషీ కోరడం వర్సిటీల్లో చర్చనీయాంశమైంది. ఈక్రమంలో ఓ వర్సిటీ రిజిస్ట్రార్ స్వయం ప్రతిపత్తి(ఆటానమస్)తో కూడిన వర్సిటీలపై కలెక్టర్ పెత్తనం ఏమిటని కొందరు ప్రొఫెసర్ల వద్ద ప్రస్తావించడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. పాలన అంతా సవ్యంగా సాగినప్పుడు సంజాయిషీ ఇచ్చుకునే అవకాశం ఉండదు కదా.. తప్పులు చేయనప్పుడు ఇలాంటి పరిస్థితులు ఎందుకు వస్తాయంటూ కొందరు ప్రొఫెసర్లు రిజిస్ట్రార్ల తీరుపై చర్చించుకోవడం విశేషం.

టీవీ, సెల్‌ఫోన్లతో కంటి సమస్యలు

- సూపరింటెండెంట్ సత్యనారాయణ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లు, టీవీలను అధికంగా చూడటం వల్లే కంటి సమస్యలు అధికమవుతున్నాయని కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సత్యనారాయణ రెడ్డి అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా గురువారం హాస్పిటల్‌లో వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ కారణంగా ఇటీవల కాలంలో విద్యార్థుల్లో కంటి చూపు మందగిస్తోందన్నారు. సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్, టీవీని 20 నిమిషాలు చూస్తే 20 సెకన్ల పాటు కళ్లకు విశ్రాంతి ఇవ్వాలని సూచించారు. చిన్న పిల్లల్లో విటమిన్ లోపాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. క్యారెట్, ఆకుపచ్చ కూరగాయలు, మామిడి పండ్లను తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంఘం కార్యదర్శి డాక్టర్ సంధ్యారెడ్డి, ఐ-హాస్పిటల్ ఆర్ఎంవో జి.భరత్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ సందీప్, సాయికిరణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ విశాలక్ష్మి పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించారని యువతి బలవన్మరణం

సంజామల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రేమ పెళ్లికి పెద్దలు నిరాకరించారని ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని కానాల గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన మహమ్మద్ హుసేన్ కూతురు హుసేన్‌బీ(29) అదే గ్రామానికి చెందిన కిరణ్‌ను చిన్ననాటి నుంచి ప్రేమించింది. అతడు టీటీసీ, బీఈడీ పూర్తిచేశాడు. ఇటీవలే హుసేన్‌బీ కుటుంబీకులు ఆమెకు పెళ్లి ప్రయత్నాలు చేశారు. ఆమె కిరణ్‌నే పెళ్లి చేసుకుంటానంటూ మొండికేసింది. వారు నిరాకరించడంతో మనస్తాపం చెందింది. బుధవారం అర్ధరాత్రి విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహాన్ని శవపరీక్ష చేయించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాహుల్ నాయకత్వాన్ని దేశం కోరుతోంది

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి గణేష్



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి గణేష్

కర్నూలు అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుతున్నారని ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి గణేష్ కుమార్ యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ సభ్యుడు జే.లక్ష్మీనరసింహ అధ్యక్షతన డీసీసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గణేష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందన్నారు. 11 సంవత్సరాల బీజేపీ పాలనతో దేశ ప్రజలు జీఎస్టీ పేరుతో పన్నుల భారంతో విసిగిపోయారని తెలిపారు. బీహార్ ఎన్నికల్లో జీఎస్టీ అంశం తెరపైకి తెచ్చి మరోసారి ఓట్లు దండుకునేందుకు ప్రజలను ప్రధాని మోదీ మభ్యపెడుతున్నారని ఆరోపించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి మాట్లాడుతూ బీజేపీ ఓట్ల దొంగతనం బయటకు తీసిన రాహుల్ గాంధీకి మద్దతుగా సంతకాల సేకరణ చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, మాజీ డీసీసీ కె.బాబురావు, నియోజకవర్గాల ఇన్‌చార్జి ఎం.ఖాసీం, అనంతరత్నం మాదిగ, రమేష్ యాదవ్, దేవిశెట్టి ప్రకాష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బి.మహేంద్ర నాయుడు, వై.మారుతి రావు, షేక్ ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


చింతకుంట నుంచి లారీలో పిల్లా పాపలతో వలస వెళ్తున్న గ్రామస్థులు


మూటలు మోసుకుని వలస వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న చింతకుంట వాసులు


తెలంగాణకు వలస వెళ్లేందుకు బిందెలతో నడిచి వస్తున్న గ్రామస్థులు

చింతకుంట చిన్నబోయింది

రాయలసీమలో కరువుకు కర్నూలు పశ్చిమ పల్లెలు కేరాఫ్‌గా ఉన్నాయి. పిడికెడు అన్నం కోసం ప్రజలు పాట్లు పడుతున్నారు. వ్యవసాయాన్నే నమ్ముకున్న అన్నదాత అప్పుల పాలయ్యాడు.. బతుకు దుర్భరమై.. గుండె భారమై.. పిల్లాపాపలతో వలసబాట పట్టారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 12 వాహనాల్లో తెలంగాణకు పయనం అయ్యారు. చదువుకునే పిల్లలు సైతం జీవన పోరుకు సిద్ధమయ్యారు. రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు జిల్లా కోసిగి మండలంలోని చింతకుంట చిన్నబోయింది. గ్రామంలో ఏ ఇంటికి చూసినా తాళాలే కనిపిస్తున్నాయి. ఇంట్లో అందరూ వలస వెళ్లడంతో పెద్దదిక్కు ఉన్న వారు తమ కొడుకులు, కోడళ్ల స్థితిని చూసి కన్నీటితో వీడ్కోలు పలికారు. ఊరంతా వలస వెళ్లడంతో నిర్మానుష్యంగా మారింది. ఈ పాపానికి కారుకులు ఎవరు? అధికారులా? ప్రజాప్రతినిధులా? లేక పాలకులా?. ఏది ఏమైనా ఈ దృశ్యాలను చూస్తే ఎంతటి వారికైనా కన్నీళ్లు రావాల్సిందే..

- 200 కుటుంబాలు కోసిగి నుంచి తెలంగాణకు వలసలు
- నిర్మానుష్యంగా గ్రామం
- ఎటుచూసినా ఇళ్లకు తాళాలు
- ఈ ఏడాది కూలీలతో పాటు రైతులదీ ఇదే
- 12 వాహనాల్లో పయనం

కోసిగి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చింతకుంట గ్రామం వలసలతో చిన్నబోయింది. గ్రామంలో 3,200 మంది జనాభా ఉంది. 2,150 మంది ఓటర్లు ఉన్నారు. ఇటీవలే అందరూ కలిసి దసరా పండుగ చేసుకున్నారు. గ్రామం అంతా వలసబాట పట్టారు. ఈ ఏడాది కూలీలతో పాటు రైతులు కూడా వ్యవసాయంలో తీవ్రంగా నష్టపోవడంతో ఇంటికి తాళం వేసి పంటల కోసం చేసిన అప్పులు తీర్చాలని, పిల్లాపాపలతో కలిసి తెలంగాణకు వలసబాట పట్టారు. గురువారం చింతకుంట గ్రామం నుంచే 12 వాహనాల్లో సుమారు 180 కుటుంబాల నుంచి 1200 మంది జనాభాకు పైగా పిల్లాపాపలతో కలిసి మూటముల్లె సర్దుకుని తెలంగాణాలోని వికారాబాద్‌కు పత్తి పనుల కోసం వెళ్లారు. కొందరు రైతులు మొదటిసారిగా దుఃఖంతో చేసిన అప్పులు కట్టేందుకు పిల్లాపాపలతో కలిసి వలసబాట పట్టారు. బడుల్లో చదువుకునే సుమారు 80 మంది దాకా చిన్నారులు సైతం తల్లిదండ్రులను అనుసరించారు. విద్యార్థులు సైతం తల్లిదండ్రుల వెంట వెళ్లడంతో ప్రభుత్వ బడులలో హాజరు శాతం దక్కింది. ఇప్పుడిప్పుడే పశ్చిమ ప్రాంతంలో వలసలు మొదలయ్యాయి. కోసిగి మండలంలో వేలాది సంఖ్యలో వలసబాట పట్టేందుకు పయనమవుతున్నారు.



ఈ ఫొటోలోని విద్యార్థి పులుసు ప్రవీణ్. నాలుగో తరగతి చదువుతున్నాడు. తండ్రి పులుసు చిన్న వీరన్న ఇంటికి తాళం వేసి వలస వెళ్తున్నాడు. కుమారుడిని సైతం తీసుకెళ్తున్నాడు. నేను రాను చదువుకుంటానని ప్రవీణ్ ఏడుస్తూ మారం చేస్తున్న దృశ్యం అందరినీ కలిచివేసింది. ఇంటికి తాళం వేశామని. ఎవరు నీకు అన్నం పెడుతారని తండ్రి ఈరన్న చెప్పినా వినకుండా ఏడుస్తూ మారం చేశాడు. ఇక గత్యంతరం లేక వీరన్న తన చెల్లెలి ఇంట్లో వదిలి వలస వెళ్లాడు.

మా బతుకులు మారవు.. వలస తప్పదు



ప్రతి ఏటా మేము మా పిల్లలను వెంట పెట్టుకుని వలస వెళ్తున్నాం. మా బతుకులు మారడం లేదు. సుగ్గికి వెళ్లాలని ఎవరూ అనుకోం. ఇక్కడే ఉంటే పెద్దవారికి పనులు దొరుకుతాయి. పిల్లలకు పనులు ఉండవు. సుగ్గికి వెళితే పని చేసి నాలుగు రూపాయలు వెనుకేసుకుంటాం.

- పీకలబెట్ట అయ్యమ్మ, చింతకుంట గ్రామం

ఇక్కడే ఉంటే అన్నం పెట్టేది ఎవరు?



మా అమ్మనాన్న ఇంటికి తాళం వేసి తమ్ముడిని వలస తీసుకెళ్తున్నారు. ఇక్కడే ఉంటే నాకు అన్నం ఎవరూ పెట్టరు. అందుకే నేను కూడా మా అమ్మనాన్నలతో కలిసి వలస వెళ్తున్నా..

- హరికృష్ణ, 6వ తరగతి విద్యార్థి, పల్లెపాడు హైస్కూల్

రైతు కష్టం పగవాడికి వద్దు



ఏడెకరాల పొలంలో మూడెకరాల ఉల్లి, మూడెకరాల పత్తి, ఒక ఎకరా వేరుశనగ వేశా. రూ.4లక్షల మేర పెట్టుబడి పెట్టాను. ఒక్క ఎకరాకు డబ్బులు కూడా రాలేదు. రూ.4లక్షలు అప్పులయ్యాయి. ఇది రైతుల దీన స్థితి. ఈకష్టం పగవాడికి కూడా వద్దు.

- పులుసు చిన్న వీరన్న, చింతకుంట

ప్రభుత్వమే ఆదుకోవాలి



ఈ ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయాం. పంట నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి. లేకపోతే అప్పులను తీర్చేందుకు ఒక్క రైతు కూడా గ్రామంలో ఉండడు.

- హనుమయ్యగారి చింతలయ్య, రైతు, చింతకుంట గ్రామం

అమ్మా వెళ్లి వస్తా..

- పాఠశాలకు వెళ్తూ అనంత లోకాలకు..
- రోడ్డుప్రమాదంలో తండ్రీకొడుకు దుర్మరణం
- బిల్లేకల్ సమీపంలో ఘటన
- మృతులు క్రిష్ణగిరి మండలం పోతుగల్లు వాసులు

ఆస్పరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ ఉండి చదువుకుంటున్న కొడుకు దసరా సెలవులకు ఇంటికొచ్చాడు.. సెలవులంతా కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపాడు.. ఎంతో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు.. ఇంతలోనే సెలవులు ముగిశాయి.. బడులు తెరుచుకున్నాయి.. 'అమ్మా వెళ్లి వస్తా.. అక్క.. చెల్లి జాగ్రత్త..' మళ్లీ సెలవుల్లో వస్తా.. అంటూ తల్లి, అక్క, చెల్లితో అన్న చివరి మాటలు.. ఇక కొడుకును తీసుకొని పాఠశాలలో వదిలేందుకు బైక్‌పై తండ్రి బయలుదేరారు. తండ్రీకొడుకులు మాట్లాడుకుంటూ ఒక గంట పాటు ప్రయాణాన్ని సాఫీగా సాగించారు.. ఇంకో గంటల్లో వారు తమ గమ్యస్థానానికి చేరుకునే వారు.. అంతలోనే అతివేగంతో ఎదురుగా లారీ రూపంలో మృత్యువు వచ్చి వారి కబళించింది. ఈ ప్రమాదంలో విద్యార్థి శ్రీనివాసులు(14) అక్కడికక్కడే చనిపోయాడు. తండ్రిని కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ హృదయ విదారక ఘటన గురువారం ఆస్పరి మండలంలోని బిల్లేకల్ గ్రామ సమీపంలో చోటుచేసుకున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. వివరాలు.. క్రిష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామానికి చెందిన మాల దాసరి శ్రీనివాసులు(14) అరికెర గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు నిమిత్తం గ్రామానికి వచ్చాడు. సెలవులు ముగియగా తండ్రి మాల దాసరి మహేష్(45)తో కలిసి బైక్‌పై పాఠశాలకు పయనమయ్యాడు. బిల్లేకల్ గ్రామ సమీపంగా చేరుకున్నారు. బళ్లారి వైపు నుంచి కర్నూలుకు వెళ్తున్న లారీ అతివేగంగా ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థి శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన దాసరి మహేష్‌ను కర్నూలు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య రామేశ్వరమ్మ, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. తండ్రీకొడుకు మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


శ్రీనివాసులు (ఫైల్)


దాసరి మహేష్ (ఫైల్)

చింతకుంటలో గొర్రెల మందపై చిరుత దాడి

కోసిగి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో గురువారం గొర్రెల మందపై చిరుతపులి మెరుపుదాడి చేసి ఒక గొర్రెను లాక్కెళ్లింది. గ్రామ సమీపంలోని కొండ దగ్గర గొర్రెల మందపై చిరుత ఒక్కసారిగా విరుచుకుపడి గొర్రెను ఎత్తుకెళ్లిందని, తాము భయంతో పరుగులు తీయాల్సి వచ్చిందని గొర్రెల కాపరి సాబాయి చిన్నతిక్కయ్య తెలిపాడు. గతంలో కూడా రెండు గొర్రెలపై చిరుత దాడి చేసి చంపేసిందన్నారు.

బాలిక అదృశ్యం

కర్నూలు క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. సంతోష్‌నగర్ చెందిన ఈ బాలిక శుక్రవారం ఉదయం కళాశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అన్ని చోట్ల, బంధువుల, తెలిసిన వారి ఇళ్లలో గాలించారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోగనూరు రోడ్డు కాలనీకి చెందిన సునీత (39) అనే మహిళ భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలు.. సోగనూరు రోడ్డు కాలనీకి చెందిన సునీత, భర్త అజాక్ గుజిరి పని చేస్తూ జీవనం సాగించేవారు. వీరికి ముగ్గురు పిల్లలు. మద్యానికి బానిసైన అజాక్ రోజు తాగి వచ్చి సునీతను మానసికంగా హింసించేవాడు. ఈ వేధింపులు భరించలేక సునీత గురువారం ఆత్మహత్య చేసుకుందని ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అవుకులో వ్యక్తి..

అవుకు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెస్త వీధికి చెందిన శేగు గురువయ్య (47) క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రాజారెడి తెలిపిన వివరాలివీ.. గురువయ్య భార్య గంగాజనమ్మ నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మరణంతో గురువయ్య మనోవేదనకు గురై ఇంటిపైకి వెళ్లి క్రిమిసంహారిక మందును తాగాడు. కుటుంబసభ్యులు గమనించి అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గురువయ్యకు కుమారుడు ఉన్నాడు. తల్లి అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీఎం సభను విజయవంతం చేద్దాం

- జన సమీకరణలో విష్ణు మార్క్ చూపించాలి
- ప్రజల దాహార్తిని తీర్చే బాధ్యత తీసుకుంటా
- జోన్-5 టీడీపీ ఇన్‌చార్జి బీద రవిచంద్రయాదవ్


మాట్లాడుతున్న జోన్-5 టీడీపీ ఇన్‌చార్జి బీద రవిచంద్రయాదవ్

కర్నూలు రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభను విజయంతం చేద్దామని రాయలసీమ జోన్-5 టీడీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ టీడీపీ ముఖ్య నాయకులకు పిలుపునిచ్చారు. పీఎం, సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం కోడుమూరు నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఈసమావేశానికి అధ్యక్షత వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు రామలింగారెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ సంజీవకుమార్ పాల్గన్నారు. ఈసందర్భంగా రవిచంద్రమాట్లాడుతూ భారీ జనసమీకరణ చేసి పీఎం సభలో విష్ణు మార్క్ చూపించాలని సూచించారు. జిల్లాల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కర్నూలు జిల్లాకు డ్రోన్‌సిటీ వంటి అనేక పరిశ్రమలు తీసుకొచ్చారన్నారు. 39ఏళ్ల తర్వాత కోడుమూరు నియోజకవర్గం టీడీపీ భారీమెజార్టీతో గెలిచి సంపూర్ణ అధికారంలో ఉన్నారని ఇక్కడి నుంచే జనసమీకరణ భారీగా ఉండాలని ఆయన కోరారు. కోడుమూరు, ప్యాలకుర్తి తాగునీటి ప్రాజెక్టు విషయంలో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రజల దాహార్తి తీర్చే బాధ్యత తీసుకుంటామన్నారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ పీఎం సభకు దాదాపు 5లక్షలమంది జనసమీకరణ చేసి అందరం కలిసికట్టుగా జయప్రదం చేద్దామన్నారు. ప్రతి గ్రామానికి బస్సు ఏర్పాటుచేస్తామన్నారు. రామలింగారెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లాల్లో కోడుమూరు నియోజకవర్గం నుంచి బలమైన నాయకత్వం వుందన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి, బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో కోడుమూరు నియోజకవర్గ కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

డీసీసీబీ లాభాలన్నీ ప్రజలకే

- వినూత్న డిపాజిట్లతో అత్యధిక వడ్డీ
- చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆర్జిస్తున్న లాభాలన్నీ ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామనీ బ్యాంకు చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. అదేవిదంగా ప్రజలకు వినూత్న డిపాజిట్ల పథకాల ద్వారా ఎక్కువ వడ్డీని వాణిజ్య బ్యాంకులకంటే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. గురువారం కర్నూలు నగరంలోని జిల్లా సహకార బ్యాంకు కాన్ఫరెన్స్ హాలులో దీపావళి, సహకార వారోత్సవాల సందర్భంగా 666 రోజుల కాల పరిమితితో సహకార ఉత్సవ్ అనే నూతన డిపాజిట్ల పథకాన్ని చైర్మన్ తన కార్యాలయంలో ప్రారంభించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు దీపావళి సందర్భంగా వారికి ఎక్కువ ప్రయోజనాన్ని అందించే నూతన డిపాజిట్ పథకాన్ని అమలు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఉమ్మడి జిల్లా ప్రజలకు, సీనియర్ సిటిజన్లకు అత్యధిక ప్రయోజనాన్ని కలిగించేలా 'నూతన ఉత్సవ్' అనే డిపాజిట్ పథకాన్ని ప్రారంభించామన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు 8.10 వడ్డీ, సాధారణ ప్రజలకు 7.60 వడ్డీని డిపాజిట్ పథకం ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకం గడువు ఈ ఏడాది నవంబరు 21వ తేదీ వరకు మాత్రమే అమలులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో రామాంజనేయులు, జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ సునీల్ కుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు త్రినాథ్ రెడ్డి, ఏ.గీత తదితరులు పాల్గొన్నారు.


నూతన డిపాజిట్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

స్మార్ట్ కార్డుల పంపిణీ



స్మార్టు కార్డులను పంపిణీ చేస్తున్న మంత్రి

నంద్యాల రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని 4వ వార్డులో రేషన్ స్మార్టు కార్డులను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఫోటో లేకుండా ప్రచురించి కార్డులను పంపిణీ చేశారని ఇప్పుడు ఇలా లేదని ప్రజలకు ప్రభుత్వానికి పారదర్శకంగా రేషన్ పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రేషన్ సమాచారం వారి మొబైల్ ద్వారానే చూసుకోవచ్చు అన్నారు. సమాచారాన్ని కూడా ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసలుబాటు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రంగప్రసాద్, సుబ్బలక్ష్మయ్య, శ్యాంసుందర్‌గుప్తా, సివిల్ డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్‌రావు పాల్గొన్నారు.

డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలి

నంద్యాల రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీల్లో పని చేస్తున్న డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, యేసురత్నం డిమాండు చేశారు. డాక్టర్ల సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ.. గతంలో ఇన్ సర్వీస్ ఉన్న డాక్టర్లకు పీజీలో 30శాతం సీట్లు కేటాయించాలన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవలను పునప్రారంభించాలి

నంద్యాల రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు వైద్య సేవలో మిన్నగా ఎన్న ఎన్టీఆర్ వైద్య సేవలను పునప్రారంబించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, నాగరాముడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎలుకలను నివారణకు మందులు వాడాలి

నంద్యాల రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులందరూ ఎలుకల నివారణకు ఒకేరోజు ఎలుకల మందుల వాడాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావ్ కోరారు. గురువారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరలను పెట్టే మందురోజు ఎలుకల బోరియలను మట్టితో మూసివేయాలని సూచించారు. మరుసటి రోజు ఎలుకల ద్వారా తెరువబడిన బొరియలలో బ్రోమోడియాలోన్ 0.25శాతం ఎరలను ఉంచాలన్నారు.

ప్లాస్టిక్ నిషేధం.. ఆచరణకు ఆమడ దూరం





ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా బట్టసంచులు





ప్లాస్టిక్‌తో నిండిన మురుగు కాలువ

ఆత్మకూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం మనుషులతో పాటు మూగజీవాలకు సైతం ప్రాణ సంకటంగా మారింది. భారత ప్రభుత్వం 1986లోనే పాలిథిన్ కవర్లను నిషేధిస్తూ చట్టాన్ని రూపొందించింది. అయితే ఈ చట్టం సక్రమంగా అమల్లో నీరుగారుతోందన్న విమర్శలు ఉన్నాయి. భూమిలో సమతౌల్యం లోపించి తద్వారా పర్యావరణానికి విఘాతం కల్గుతోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అయిన ప్పటికీ ప్రజలు మాత్రం నిర్లక్ష్యాన్ని వీడకుండా పాలిథిన్ కవర్ల వాడకాన్ని వదులుకోలేకపోతున్నారు.

ఆత్మకూరులో విచ్చలవిడిగా వాడకం

ఆత్మకూరు మున్సిపాలిటీలో పాలిథిన్ కవర్ల వినియోగం విచ్చలవిడిగా జరుగుతోంది. నిబంధనల ప్రకారం 50మైక్రోన్ల కన్నా తక్కువ స్థాయి గల కవర్లను విక్రయించరాలేదు. అయితే కూరగాయలు, పండ్లు, పూలు, తదితర వస్తువుల కొనుగోళ్లకు సంబంధించి చాలా మంది కవర్లను వాడేస్తున్నారు. ఇవేకాకుండా ప్లాస్టిక్ గ్లాసులు, కప్పులు, ప్లేట్లు ఇలా అనేక విధాలుగా ప్లాస్టిక్ వస్తువులను అధికంగా వినియోగిస్తున్నారు. వాడకాన్ని బట్టి కవర్ల వ్యాపారులు కూడా ప్లాస్టిక్ కవర్ల విక్రయాలను జోరుగా సాగిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలో పలువురు వ్యాపారులు భారీగా ప్లాస్టిక్ కవర్ల నిల్వాలు ఉంచుకుని విక్రయాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా పాలిథిన్ కవర్లు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. అలాగే డ్రైనేజీ కాల్వలో కూడా పాలిథిన్ కవర్లు పేరుకుపోయి మురికినీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతోంది. సాక్ష్యాత్తు ఆత్మకూరులోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న కాల్వలోనే భారీగా ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోయినా అధి కారులకు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాగా గతంలో అనేక మార్లు మున్సిపల్ అధికారులు పాలిథిన్ కవర్ల నియంత్రణకు శ్రద్ధ వహించినప్పటికీ అది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. దీంతో పాలిథిన్ కవర్ల నిషేదం సాధ్యమేనా..? అన్న విమర్శలు నెలకొన్నాయి.

ప్రజల్లో విస్తృత అవగాహన అవసరం



పాలిథిన్ కవర్లకు ప్రత్యామ్నాయంగా బట్ట సంచులను వాడుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. అదేవిధంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించాలి. ప్రత్యేకించి పాలిథిన్ కవర్ల వాడకంతో రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోవడమే కాకుండా కవర్లు భూమిలో కలుషితమై వర్షపునీటిని భూగర్భలోకి చేరకుండా చేస్తోంది. అదేవిధంగా మురికికాల్వలోకి చేరి నీటి ప్రవాహాన్ని ఎక్క డికక్కడే నిలిపివేసి దోమల వ్యాప్తిని పెంపొందిస్తోంది. అలాగే రోడ్లపై ప డిన కవర్లను పశువులు తినడం వల్ల జీర్ణకోశ సంబంధిత వ్యాధులు మరణాలు సంభవించే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ప్లాస్టిక్ కవర్లలో తెచ్చే ఆహార పదార్థాలతో కాన్సర్ కారణాకాలు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. అనర్థాల గురించి ప్రచారం జరగనట్లు తెలుస్తోంది.

విద్యార్థులకు సకాలంలో బస్సు సౌకర్యం కల్పించాలి

నందికొట్కూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పరిసర ప్రాం తాల నుంచి వచ్చే విద్యార్థిని విద్యార్థులకు బస్సు సౌకర్యం సకాలంలో కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంజిల్లా కార్యదర్శి మద్రిస్వామి డిమాం డ్ చేశారు. గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు శివ, ఖలీల్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ఆత్మకూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదని కంటి వైద్య నిపుణులు డాక్టర్ షేక్షావలి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు నిర్వహించిన సమావేశంలో కళ్ల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు కృష్ణ, సుబ్బలక్ష్మీ తదితరులు ఉన్నారు.

'జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి'

ఆత్మకూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల జర్నలిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆత్మకూరు పట్టణంలో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి ర్యాలీగా గౌడ్‌సెంటర్‌కు వెళ్లి అక్కడ రాస్తారోకో చేశారు. అలాగే అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పుడు కేసులను మీడియా స్వేచ్ఛను ఆపలేవని హెచ్చరించారు.

'పులివెందులదో మెడికల్ కళాశాల ఉందో లేదో చూసుకోండి'

నందికొట్కూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు కొందరు పులివెందులలో జగన్మోహన్‌రెడ్డి ఎందుకు మెడికల్ కళాశాల నిర్మించలేదని ప్రశ్నిస్తున్నారని, వారు పులివెందులకు వస్తే అక్కడ మెడికల్ కళాశాలా ఉందా లేదా అన్నది చూపిస్తామని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డా.ధార సుధీర్ అన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు టీడీపీ నాయకులు జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనే మెడికల్ కళాశాలను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నిస్తున్నారని, వారు పులివెందులకు వస్తే మెడికల్ కాలేజీ ఉందా లేదా చూసి ఆ కాలేజ్ వద్ద ఫోటో తీసుకొండని ఎద్దేవా చేశారు. వైసీపీ జడ్పీటీసీలు, సర్పంచ్‌లు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యూయార్క్ అంబాసిడర్‌తో మాండ్ర శివానందరెడ్డి



న్యూయార్క్ అంబాసిడర్ పర్వతనేని హరీష్‌తో మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యూయార్క్ అంబాసిడర్ పర్వతనేని హరీష్‌ను టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ప్రతినిధి మాండ్ర శివానందరెడ్డి న్యూయార్క్‌లో కలిశారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పట్ల వ్యవహరిస్తున్న వ్యతిరేక విధానాల వల్ల అక్కడి భారతీయులు ఎలాంటి సమస్యలకు గురవుతున్నారని, ఉక్రేయిన్-రష్యా పాక్ ఇండి యుద్ధం, ఇలా ఇతర దేశాల్లో జరుగుతున్న యు ద్ధాల వల్ల మన భారతీయులు, అందులోనూ తెలుగు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై న్యూ యార్క్ అంబాసిటర్ పర్వతనేని హరీష్‌తో చర్చించినట్లు మాండ్ర తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు మాండ్ర తెలిపారు. న్యూయార్క్ దేశంలోని ఓ కంపెనీ అక్కడి పండ్లు, పూలమొక్కలను పెంచే సంస్థను నంద్యాల జిల్లాలో ఏర్పాటు చేసేందుకు శుముఖత తెలిపినట్లు ఆయన తెలిపారు.

జోరువానలకు... రైతులు ఇబ్బందులు



కేజీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పాములపాడు, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో తూఫాన్ కారణంగా రోజు వర్షాలు కురరుస్తుండటంతో ప్రజలే కాక రైతులు చేతి కొచ్చిన పంటలు కోసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు అధికం కావడంతో మండలంలో వాగులు వంకలు ఉప్పొంగి వేల ఎకరాలలో పంటలు మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు.. ఉన్న కాస్తో కూస్తో పండిన పంటలు కోతకొచ్చే సమయానికి తిరిగి వర్షాలు ఏకదాటిగా కురుస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2 తులాల బంగారం రికవరీ

నంద్యాల టౌన్ అక్టోంబర్ 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల నంద్యాల పట్టణంలోని బైర్మల్ వీధిలో డీఎస్ఆర్ జూవెలరీ దుకాణంలో ఒక మహిళా రెండు తులాల బంగారు అభరణాన్ని దొంగిలించింది. అయితే వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. గురువారం గాంధీ చౌక్ ప్రాంతంలో అనంతపురం ప్రాంతానికి చెందిన అనిలక్కను అనుమానం వచ్చి విచారించారు. దీంతో ఆమె వద్ద నుంచి రెండు తులాల బంగారు అభరణం స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండు కు తరలించినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

నూతన ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నూతన ఎస్పీ సునీల్ షెరాన్‌ను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాలలోని ఎస్పీ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సమస్యలపై ఆయన ఎస్పీతో చర్చించారు.

వైసీపీ ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశం

నంద్యాల రూరల్, అక్టోరు 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వెసీపీ ఎస్సీ సెల్ విస్తృతస్థాయి సామావేశం గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బలమైన సామాజిక వర్గానికి వైసీపీ ఎన్నో మంచి కార్యక్రమాలు చేసిందన్నారు. గతంలో ఎన్నో పదువులు ఇచ్చి గౌరవించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి, డా.సుధీర్‌కుమార్ నాయకులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డును వేయండి

పాణ్యం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం విజయానికేతన్ పాఠశాల వద్ద సర్వీసు రోడ్డు వేయాలని ప్రజా సంఘాలు గురువారం తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేశాయి. ఈనెల 8వతేదీన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మోడల్ పాఠశాల ఉపాధ్యాయిని సౌజన్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి ప్రతాప్ మాట్లాడుతూ ఓ పాఠశాల యాజమాన్యం నిర్లక్షం వల్లే ఎంతో మంది పాఠశాల సమీపంలో ప్రాణాలు కోల్పోతుయన్నారు.

'వైసీపీ నాయకులు నీచ రాజకీయాలు మానుకోవాలి'

నంద్యాల రూరల్, అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు నీచ రాజకీయాలు మానుకోవాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయం నుంచి నిరసన తెలుపుతూ బొమ్మలసత్రంలోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్ర హానికి పూలమాల, వేసి క్షీరాభిషేకం చేశారు. చిత్తూరు జిల్లాలో వైసీపీ నాయకులు ఆయన విగ్రహానికి నిప్పు పెట్టడం అమానుషమన్నారు. నందికొట్కూర్ ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ.. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలన్నారు.

ఎత్తిపోతల, పగిడ్యాల రోడ్డును బాగు చేయండి

పగిడ్యాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగటూరు ఎత్తిపోతల పథకం వద్ద మోటార్లకు మరమ్మతులు చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండ చాడాలని, గుతలమయంగా మారిన పగిడ్యాల రోడ్డును బాగు చేయాలని పగిడ్యాల జెడ్పీటీసీ పుల్యాల దివ్య కోరారు. మండల కేంద్రమైన పగిడ్యాలలోని తమ స్వగృహంలో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించేందుకు వచ్చిన ఎంపీ కాంట్రాక్టర్ పై వ్యక్తిగత దూషనలు చేయడం తగదన్నారు.

బాక్సింగ్ జట్టుకు డీఎస్పీ శుభాకాంక్షలు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా బాక్సింగ్ అండర్ -14బాలురు, అండర్-17బాలికల జట్లకు గురువారం డీఎస్పీ జావళి అల్ఫోన్స్ రైల్వే స్టేషన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 10, 12తేదీల్లో రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కర్నూలు జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా డీఎస్పీ జావళి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి బీహెచ్ విశ్వనాథ్, జిల్లా ఎస్ఏపీ ఈ కార్యదర్శి పి.నాగరాజు, జట్టు మేనేజర్ సురేష్ పాల్గొన్నారు.

నామమాత్రంగా పల్లె పండుగ

కొత్తపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ నామమాత్రంగా సాగింది. మొదటి రోజు గురువారం మండలంలోని గువ్వలకుంట్ల, గోకవరం, కొత్తపల్లి, వీరాపురం గ్రామాల్లో అధికారికంగా పల్లెపండుగ నిర్వహించాలని ఎంపీడీవో మేరి ఓ సర్క్యులర్‌ను సైతం జారీ చేసింది. అయితే.. నాలుగు గ్రామాల్లో పల్లె పండుగ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కేవలం గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీలోని పాలెంచెరువులో మాత్రం నామమాత్రంగా గోకులం షెడ్డును సర్పంచ్ మశమ్మ టెంకాయ కొట్టి మమ అనిపించారు. అయితే ఈ భూమి పూజల్లో కూడా మండల, గ్రామ స్థాయి అధికారులు అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సి ఉన్నా పాల్గొనలేదు. పల్లెపండుగను ప్రభుత్వం అధికారికంగా చేపట్టినప్పటికీ గోకవరం, కొత్తపల్లి, వీరాపురం గ్రామాల్లో పల్లె పండుగ జరగకపోవడం వల్ల పలు విమర్శలకు తావిస్తుంది. ఈ విషయంపై మండల ఉపాధి అధికారి విమలమ్మను వివరణ కోరగా.. తాను స్థానిక అధికారికి, నాయకులకు చెప్పినప్పటికీ మళ్లీ పల్లె పండుగ నిర్వహిస్తామని చెప్పడం గమనార్హం.







అట్టహాసంగా అటవీ సిబ్బంది క్రీడలు ప్రారంభం

● నాలుగు డివిజన్‌ల పరిధిలో పాల్గొన్న 150 మంది అటవీ సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న కన్జర్‌వేటర్ విజయకుమార్

పాణ్యం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో నాగార్జున సాగర్, శ్రీశైలం, టైగర్ ఫారెస్ట్ సర్కిల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. ఫారెస్ట్ డైరెక్టర్స్ ప్రొటెక్ట్ టైగర్ నంద్యాల సర్కిల్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు క్రీడల కన్వీనర్, నంద్యాల ఎఫ్ఆర్ఓ నాసిర్‌జా తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడలను టైగర్ ప్రాజెక్ట్ సర్కిల్, కన్జర్‌వేటర్ బి, విజయకుమార్ ప్రారంభించారు. కబడ్డీ, క్రికెట్, రన్నింగ్, వాలీబాల్, అథ్లెటిక్స్ చెస్, క్యారమ్స్, షటిల్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ తదితర క్రీడల్లో పాల్గొన్నారు. ఈ క్రీడల్లో మార్కాపురం, నంద్యాల, ఆత్మకూరు, గిద్దలూరు డవిజన్‌లకు చెందిన 150 మంది అటవీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్జర్‌వేటర్ మాట్లాడుతూ ఈ క్రీడల్లో విజేతలు జాతీయ స్థాయిలో నవంబరు 14న డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. భావితరాలకు మంచి ఆరోగ్యం, వాతావరణం అందిల్చాల్సిన బాధ్యత దృష్ట్యా ప్రతి ఉద్యోగి శారీరకంగా, మానసికంగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలన్న లక్ష్యంతో క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అప్పావు, గిద్దలూరు డీడీ మేడం నిషాకుమారి, నంద్యాల డీడీ అనురాగ్‌మీనా, మార్కాపూర్ డీడీ ఎండీ అబ్దుల్‌రవూఫ్‌షేక్, గిద్దలూరు డీఎఫ్ఓ బాలరాజు, శ్రీశైలం డీఎఫ్ఓ బబితాకుమారి, రుద్రవరం డిఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, ఎఫ్ఆర్‌ఓలు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

సైకిలెక్కిన వైసీపీ మాజీ సొసైటీ చైర్మన్



టీడీపీలో చేరిన వారితో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల మాజీ సొసైటీ చైర్మన్ రామశంక ర్‌రెడ్డి తన వర్గీయులతో కలిసి కోవెలకుంట్ల సొసైటీ చైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కోవెలకుంట్ల మండలం జోళదరాశి గ్రామానికి చెందిన రామశంకరరెడ్డి వైసీపీలో సుమారు పదేళ్లకు పైగా కొనసాగారు. అయితే మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చేస్తున్న అబివృద్ధికి ఆకర్షితులై రామశంకర్‌రెడ్డి తన వర్గీయులైన రమణారెడ్డి, మాధవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పుల్లారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, గురప్ప, కుమార్, బాలరాజు, వెంకటేశ్వర్లు, పెద్దనారాయణ, వెంకటస్వామి ., సుబ్బరాయుడు, హుసేనయ్య రషీద్, శంకర్, ఓబులేసు, చంటి, జయరాజ్, మధులతోపాటుపాటు సుమారు 70 మంది కార్యకర్తలతో బనగానపల్లెకు వెళ్లి మంత్రి బీసీని కలిసి పార్టీలో చేరారు.

ఉపాధి పనుల అవినీతిపై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

చాగలమర్రి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ తాండ గ్రామంలో చేసిన ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై గురువారం ఉపాధి ఏపీడీ సాంబశివరావు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రషీద్‌ఖాన్ పోలీసు బందోబస్తు మధ్య విచారణ చేపట్టారు. చాగలమర్రి ఉపాధి కార్యాలయంలో 13 అంశాలపై ఉపాధి టీఏతో విచారణ జరిపారు. గత ఏడాది సామాజిక తనిఖీ గ్రామసభలో ఉపాధి పనులపై బహిరంగ సభలో నివేదికలు సమర్పించారని, వాటిపై ఆరోపణలు రావడంతో ఉపాధి పీడీ విచారణకు ఆదేశించారని ఏపీడీ తెలిపారు. వివిధ పను లపై విచారణ చేశామని, క్షేత్రస్థాయిలో కూడా పనులు పరిశీలించి వాస్తవ నివేదికలను పీడీకి సమర్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

1,900 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు

బనగానపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలానికి 1,900 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. 25 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. రైతు సబ్సిడీ పోను క్వింటాం రూ.5850లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండలంలోని ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ శనగలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పేర్లు నమోదు చేసుకోండి: ఏవో

కొలిమిగుండ్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు శనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో తమపేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాదు గురువారం తెలిపారు. రబీ సాగుకు సంబంధించి కొలిమిగుండ్ల మండలానికి ప్రభుత్వం 1800 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ఆళ్లగడ్డ/ కోవెలకుంట్ల/చాగలమర్రి/ఉయ్యాలవాడ/ కొలిమిగుండ్ల అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, చాగలమర్రి, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్లలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలలో శుక్రవారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు గురువారం తెలిపారు. ఈ పోటీలలో కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్సీ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. ఇక్కడ ప్రతిభ కనపరిచిన వారు జిల్లా స్థాయిలో పాల్గొంటారని వివరించారు.

డోన్ మున్సిపాలిటీకి అవార్డు రావడం సంతోషం



ఎమ్మెల్యే కోట్ల చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న అధికారులు

డోన్ టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): డోన్ మున్సిపాలిటీకి స్వచ్ఛతా హీ సేవా అవార్డు రావడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్లను ఎమ్మెల్యే కోట్ల అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని మరింత శుభ్రమైన, ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభు త్వం నుంచి అవసరమైన మద్దతు ఇస్తామన్నారు. అనంతరం కమిషనర్ ప్రసాద్‌గౌడు, వైస్ చైర్మన్ హరికిషన్ మాట్లాడుతూ ఇండియా వైడ్ ర్యాంకింగ్‌లో 440వ స్థానంలో డోన్ మున్సిపాలిటీకి స్వచ్ఛత అవార్డు లభించిందన్నారు.

రుద్రవరం ఈవోపీఆర్‌డీగా శివప్రసాద్

రుద్రవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీగా శివప్రసాద్‌ను నియమించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. దొర్నిపాడు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న శివప్రసాద్‌ను రుద్రవరం ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో శివప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు.

ఫిజియోథెరపీతో వ్యాధులు దూరం

చాగలమర్రి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఫిజియోథెరపీ వైద్యంతోనే వ్యాధులు దూరమవుతాయని ఎంఈవో-2 న్యామతుల్ల తెలిపారు. గురువారం చాగలమర్రి భవితా కేంద్రాన్ని తనిఖీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు చేస్తున్న ఫిజియోథెరపిని పరిశీలించారు. వైద్యులు వెంకటసుబ్బయ్య ఫిజియోథెరపి వైద్యం గురించి దివ్యాంగ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

డోన్ టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తారని, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ పంపిణీ మరింత వేగవంతం

- చౌక దుకాణాలకు స్మార్ట్ ఈ-పాస్ యంత్రాల పంపిణీ
- పౌరసరఫరాల శాఖ సరి కొత్త టెక్నాలజీ ప్రయోగం
- లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ కార్డులు

కొలిమిగుండ్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం మరింత పటిష్టంగా మార్చుతూ అడుగులు వేసింది. సుదీర్ఘకాలంగా రేషన్ పంపిణీ వ్యవస్థలో నెలకొన్న లోపాలను సరిచేయడంతోపాటు, అక్రమాలకు ఇక చెక్ పేట్టే విధంగా చౌకదుకాణాలకు అధునాతన టెక్నాలజీనీ జోడిస్తూ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లాలో రేషన్ డీలర్లకు 5జీ టెక్నాలజీతో పనిచేసే స్మార్ట్ ఈ-పాస్ (ఎలాక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాలను పౌరసరఫరాల శాఖ పంపిణీ చేసింది. ఉమ్మడి జిల్లాలోని 2,437 చౌకదుకాణాల్లో స్మార్ట్ ఈ-పాస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకవచ్చారు. వీటి ద్వారా చౌకదుకాణాల్లో రేషన్ పంపిణీ ప్రక్రియ ఇక మరింత సులభతరంగా మారనుంది. ముఖ్యంగా రేషన్ పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు చెక్ పడనుంది. నూతన ఈ-పాస్ యంత్రం సాయంతో వినియోగదారులు గంటల తరబడి చౌకదుకాణాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండదని డీలర్లు పేర్కొంటున్నారు. నూతన ఈ-పాస్ యంత్రం ద్వారా క్యూ ఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులను స్వైపింగ్‌తో పాటు, వేలి ముద్రల పక్రియ వేగవంతంగా కానుంది. మరోవైపు వేలి ముద్రలు పడని



స్మార్ట్ కార్డులు, చౌకదుకాణంలో ఈపాస్ యంత్రంతో సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వారికి నూతన ఈ-పాస్ యంత్రంలో ఐరిస్(కనుపాపల) ద్వారా సరుకులు పంపిణీ చేసే అవకాశాన్ని పొందుపరిచారు. మరోవైపు సరుకులు తీసుకున్న వెంటనే తీసుకున్న సరుకులతో కూడిన వివరాలతో ఈయంత్రం ద్వారా రసీదును పొందే అవకాశాన్ని కల్పించారు. దీంతో వినియోగదారుడు ఏ సరుకులు తీసుకున్నారు, ఏవి తీసుకోలేదు అన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. దీంతో డీలర్లు వినియోగదారులకు కొన్ని సరుకులను ఇవ్వకుండా ఎగవేసే అక్రమాలు చోటు చేసుకునే అవకాశం లేదని అధికారులు వివరిస్తున్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి: మాజీ మంత్రి

బేతంచెర్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలమవుతున్నా ఎలాంటి అబివృద్ధి జరగలేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యా వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. మద్దిలేటి స్వామి క్షేత్రం రూ.20 లక్షలతో ముఖద్వారం, రూ.50లక్షలతో ఆలయ అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. బేతంచెర్ల పట్టణంలో ఎంజేపీ పాఠశాల, ప్రభుత్వ ఐటీఐ పనులు కూడా ఇంత వరకు టీడీపీ ప్రభుత్వం చేపట్టకపోవడం ఎంత వరకు సమంజసం అన్నారు. తమ హయాంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశామని, అది కూడా మూసి వేసిందన్నారు. పార్టీ ప్రతిష్ఠతకు గ్రామ, వార్డు కార్యదర్శుల కార్యనిర్వహక సభ్యులు నియామకం జరుగుతుందన్నారు. ఈ సమావేశం



మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన

లో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగరపంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, మండల కన్వీనర్ తిరుమలేష్ రెడ్డి, నాయకులు నాగరాజు, మురళికృష్ణ, నగర పంచాయతీ కన్వీనర్ పిట్టల జాకీర్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులకు నీరందించిన ఘనత టీడీపీదే

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



హుసేనాపురం చెరువు దగ్గర పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు నీరు అందించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదే అని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని హుసేనాపురం, చంద్రపల్లి చెరువలకు నీరు చేరడంతో ఆయన చెరువుల దగ్గర గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ చెరువుల నీరు చేరడంతో ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందన్నారు. సాగునీటితోపాటు తాగు నీటి కష్టాలు కూడ తీరుతాయన్నారు. రైతులు మంచి పంటలు పండించి ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. చెరువులకు నీరు సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులు పథకానికి సంబంధించిన పైపులైన్లను దుండగులు ధ్వంసం చేయకుండా తరచూ పరిశీలించాలన్నారు. చెరు వులకు నీరందించడంతో చంద్రపల్లి, హుసేనాపురం రైతులు ఎమ్మెల్యే కోట్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వై లక్ష్మీనారాయణయాదవ్, ఎస్ఐ నాగార్జున, ఆదినారాయణ, తిమ్మారెడ్డి, దామోదర్, జనార్దన్, చంద్రశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలుంటే సంప్రదించండి: తహసీల్దార్

శిరివెళ్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): భూ రీసర్వేలో రైతులకు ఏవైనా సమస్యలుంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని తహసీల్దార్ విజయశ్రీ సూచించారు. శిరివెళ్లలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని కామినేనిపల్లె గ్రామంలో ఆర్ఓఆర్ రికార్డులో కొన్ని సర్వే నంబర్లకు సంబంధించిన వివ రాలు లేవని వస్తున్న వార్తలను, అసత్య ఆరోపణలను తహసీల్దార్ ఖండించారు. ఆర్ ఎస్ఆర్, ఎఫ్ఎంటీ, అడంగల్, ఓల్డ్ ఫసలీ తదితర వాటి ఆధారంగా ప్రతి రైతుకు చెందిన వివరాలున్నాయని అన్నారు. గ్రామాల్లోని రైతుల సమక్షంలో సర్వేయర్లు, రెవెన్యూ అధికా రులు భూ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.

బాణాసంచా గోడౌన్ తనిఖీ



బాణాసంచా గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామ సమీపంలో ఉన్న బాణాసంచా గోడౌన్‌ను డోన్ డీఎస్పీ శ్రీనివాసులు గురువారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న బాణాసంచా నిల్వ లను ఆయన పరిశీలించారు. అనంతరం గోడౌన్ నిర్వహకులతో డీఎస్పీ మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మమత ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



కోటకొండలో సీసీ రోడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

రుద్రవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈ సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం కోటకొండలో సీసీ రోడ్ల నాణ్యతను ఆయన పరిశీలించారు. కోటకొండలో రూ.10 లక్షలు, బి.నాగిరెడ్డిపల్లెలో రూ.5 లక్షలు, చిలకలూరు రూ.13లక్షలు, ముత్తులూరుల రూ.20లక్షలుతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఆయన వెంట ఏఈలు కమాల్‌సాహెబ్, రాముడు ఉన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి రూ.25వేలు విరాళం గురువారం దాతలు అందించారు. నందవరానికి చెందిన ఆదినారాయణ, సుబ్బమ్మ, బాలాజీ వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు విరాళాన్ని అందజేశారు.



అర్చకుడికి విరాళం అందజేస్తున్న దాత

వీధుల్లో ముళ్ల కంప తొలగింపు



ముళ్ల కంపను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కోవెలకుంట్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వీధుల్లో గురువారం ముళ్లకంప తొలగించే కార్యక్రమం చేపట్టినట్లు కోవెలకుంట్ల ఇన్‌చార్జి ఈవో, డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు తెలిపారు. గురువా రం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఎంపీడీవో ఆఫీసు నుంచి సచివాలయం-5 వరకు ఉన్న ముళ్లకంప తొలగించామన్నారు. అలాగే ముదివేడు రస్తాలో ఉన్న అవుకు నీటి సరఫరా సంప్, సంతపేటలోని ట్యాంకుల వద్ద ఉన్న ముళ్లకంపలతోపాటు చెత్తను తొలగించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

చాగలమర్రి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చింతలచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు రూ.10వేల విలువ చేసే క్రీడా దుస్తులను విద్యార్థులకు గురువారం అందజేశారు. హెచ్‌ఎం సుబ్బరాయుడు, పీడీ దాదాపీర్, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

సంజామల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని టీడీపీ నాయకుడు కేశవరెడ్డి అన్నారు. మండలం లోని కానాల జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈవోలు వెంకటరామిరెడ్డి, ఈశ్వరయ్య హాజరయ్యారు. ఈపోటీలను కేశవ రెడ్డి ప్రారంభించారు. గురువారం బాలికల నిర్వహించిన క్రీడా పోటీల్లో సుమారు 200మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. వాలీబాల్, కోకో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు డివిజన్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని సమన్వయకర్త వ్యాయామ సంచాలకుడు బాషా తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్కి హుసేన్, హెచ్.ఎం మురళీకృష్ణ శాస్త్రి, వ్యాయామ సంచాలకుడు చిన్న మౌలాలి, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

దొర్నిపాడు: చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు అవసరమని ఎంఈవో మనోహర్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లాపరి షత్ ఉన్నత



పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు కేశవరెడ్డి

పాఠశాలలో గురువారం ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా మం డల స్థాయి ఎంపిక పోటీలను ఎంఈవో ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు, ఉద్యోగాలకు స్పోర్ట్స్ సర్టిఫి కెట్ ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు సంబంధించి డివిజన్‌స్థాయి జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రామచంద్రయ్య, ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి, ఎస్ఎంసీ చైర్మన్ సుధాకర్, పీడీలు దేవేంద్ర, సువర్ణ, సరళ, బాలకృష్ణ, లక్ష్మయ్య, ఉపాధ్యాయులు రమణయ్య, మల్లికార్జున, నాగరాజు, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర పరిశీలకులు కుసుమ

చాగలమర్రి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు కుసుమ తెలిపారు. గురువారం మండలంలోని కేపీ తాండ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు పంపిణీ చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పంపిణీపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, ఎంఈవో అనూరాధ, హెచ్‌ఎం శంకర్, సీఆర్పీ ఖాసీం, అంగన్‌వాడీ వర్కర్ ఉన్నారు.

ఆనందంగా ఉంటే ఆరోగ్యం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్

బేతంచెర్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని కేజీబీవీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అబీదా బేగం అన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా బేతంచెర్ల పట్టణ శివారులో కేజీబీవీ పాఠశాలలో మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచను, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా కేరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు మౌలాలి, శ్రీరామ్ విద్యార్థులకు మానసిక ఆరోగ్యాన్ని కాపా డుకోవడానికి అవసరమైన చిట్కాలు, సానుకూల ఆలోచనల ప్రాము ఖ్యం, ఒత్తిడి నిర్వహణ పద్ధతులపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరికీ మేలు చేసేలా సూపర్ జీఎస్టీ

చాగలమర్రి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ అందరికి మేలు చేసేలా ఉందని వైద్యశాఖ సూప ర్‌వైజర్ రామలింగారెడ్డి అన్నారు. గురువారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో సూపర్ జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈ విజయభారతి, ఫార్మాసిస్టు రాజేష్, ఎల్‌టీ నాయక్, ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్ర, హెచ్ఏ మనోహర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా తారకరామ నగర్, అక్షర స్కూల్ ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. ఇందుకు ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అధికారులతో చైర్మన్ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తన చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ పాతబస్టాండులో ఉన్నటువంటి వెజిటెబుల్ మార్కెట్‌లో మొదటి అంతస్తులో రెండు బ్లాకులు (షెడ్-3) 636-19 స్క్వేర్ మీటర్లు (షెడ్-4) 816.27 స్క్వేర్ మీటర్లు అద్దెకు ఇచ్చుటకు మున్సిపల్ శాఖ నిర్ణయించిందన్నారు. ఆసక్తిగా ఉన్నటువంటి వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, ఆర్‌వో వేదవతి, కౌన్సిలర్ ఆర్షు రమణ, సీ1 ఆర్ఐ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

డోన్ రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థులు పెంచుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సహాధ్యక్షుడు మాణిక్యంశెట్టి అన్నారు. గురువారం పట్టణంలోని కొత్తపేట ఉన్నత పాఠశాలలో చెకుముఖి సైన్స్ సంబరాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. మాణిక్యంశెట్టి మాట్లాడుతూ ఈ నెల 18న పాఠశాల స్థాయిలో నవంబరు 1న మండల స్థాయిలో, 23న జిల్లా స్థాయిలో, డిసెంబరు 12, 13, 14తేదీల్లో రాష్ట్ర స్థాయిలో చెకుముఖి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞానవేదిక నాయకులు రామ్మూర్తి, సర్వజ్ఞమూర్తి, అబ్దుల్ లతీఫ్, యూటీఎఫ్ నాయకులు నరసింహుడు, సుబ్బరాయుడు, ఎస్ఎస్ బాబు పాల్గొన్నారు.

104 వాహనాల పరిశీలన

రుద్రవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలో 104 వాహనాలను ఆపరేషన్ విభాగం అధికారి ప్రవీణ్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల డివిజనులో ప్రతి నెలా సంచార వైద్యం కింద 104 పరిధిలో 15600 మందికి వైద్యం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటరు పైలెట్, మహేశ్ పాల్గొన్నారు.

శ్రీశైల దేవస్థానం బోర్డు మెంబరును కలిసిన జనసేన నాయకులు

డోన్ రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం బోర్డు మెంబరుగా నియమితులైన రేఖాగౌడును డోన్ జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలులోని వెంకటరమణ కాలనీలో ఆమె నివాసంలో డోన్ నియోజకవర్గ జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు రేఖాగౌడును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.